క్లుప్తంగా

26న మండల సమావేశం

జలుమూరు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 26న నిర్వహించనున్నారు. ఎంపీడీఓ జి.వి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

27న సారవకోటలో..

సారవకోట: ఈ నెల 27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా వాసుదేవరావు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస ఎంపీడీఓగా ఎస్.వాసుదేవరావును నియమిస్తూ జెడ్పీ కార్యాలయం సీఈఓ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పనిచేసిన ఎం.రేణుక సెలవులో ఉన్నందున, కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.వాసుదేవరావును ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. కార్యాలయాల ఆర్థిక లావాదేవీలు, జీత భత్యాలు నిర్వహించేందుకు తక్షణమే ఈ ఉత్తర్వులు అమలు చేయాలని సీఈఓ తెలియజేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు


విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో సెక్షన్ ఏఈ పైడి వెంకటఅప్పలనాయుడు తెలిపారు. మండలంలోని రొట్టవలస ఫీడర్ పరిధిలోని రావివలస, పురుషోత్తపురం, రొట్టవలస, కొత్తకోట గ్రామాల్లో విద్యుత్ పోల్స్ ఏర్పాటు, చెట్ల కొమ్మలు, తుప్పల తొలగింపు పనులు సోమవారం నిర్వహించారు. వినియోగదారులకు భవిష్యత్‌లో ఎటువంటి విద్యుత్ ఇక్కట్లు లేకుండా చేయడం జరుగుతుందని వెల్లడించారు.

గ్లాసుల పంపిణీ

కొత్తూరు: కొత్తూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–2 విద్యార్థులకు రాగి జావ కోసం గ్లాస్‌లను గ్రామానికి చెందిన సత్యసాయి మందిరం అభివృద్ధి కమిటీ ప్రతినిధి లోతుగెడ్డ భగవాన్ నాయుడు, శ్రీగౌరీ దంపతులు సోమవారం పంపిణీ చేశారు. భగవాన్ సత్యాసాయి 12వ ఆరాధన దినోత్సవం సందర్భంగ గ్లాస్‌లు పంపిణీ చేసినట్లు భగవాన్ నాయుడు చెప్పారు. స్థానిక సత్యసాయి మందిరలో ప్రత్యేక పూజలతోపాటు సత్యసాయి గీతాలు ఆలపించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సత్యసాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

కొత్తూరు: మండలంలోని కలిగాం గ్రామానికి చెందిన కొమనాపల్లి ప్రసాదరావు పొలాల్లో నాటు సారా విక్రయిస్తుండగా పట్టుబడినట్లు ఎస్ఐ మురపాక గోవింద చెప్పారు. సారా స్వాధీనం చేసుకుని ప్రసాదరావుపై కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేసినట్లు చెప్పారు.

మదనాపురంలో ఫ్యామిలీ డాక్టర్


వైద్య సేవలు అందజేస్తున్న రాజశేఖర్

బూర్జ: ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని మదనాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్యసేవలు అందజేశారు. బీపీ 35 మందికి, సుగర్ 22 మందికి, గర్భిణులు 10 మందికి, బాలింతలు ఐదుగురికి, జ్వరపీడితులు ఐదుగురికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు.

డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంగ్లిషుకు విశ్వవ్యాప్త గుర్తింపు ఉందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అన్నారు. ఆంగ్లభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో సోమవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే వేడుకలను నిర్వహించారు. పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, పి.సుధాకర్ ప్రధాన వక్తలుగా హాజరై ఇంగ్లిషు ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ఇంగ్లిషు విభాగం లెక్చరర్లు పాల్గొన్నారు.

గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు

- ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం
- సర్పంచ్‌లు, ఎంపీటీలకు సత్కారం

పల్లెలే దేశాభివృద్ధి పట్టు గొమ్మలన్న గాంధీజీ సూక్తిని నిజం చేసేందుకు అందరూ కలిసి పని చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పలువురు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అన్ని మండలాల్లోనూ సోమవారం ఘనంగా నిర్వహించారు. దేశంలోనే మొదటిసారిగా గడప వద్దకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన తీసుకువచ్చినట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో పల్లెలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్


జలుమూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాన గోపిని సన్మానిస్తున్న సర్పంచ్‌లు, అధికారులు


కొత్తూరు: ఎంపీడీఓ కార్యాలయంలో పొనుటూరు సర్పంచ్ చామంతమ్మ, పంచాయతీ కార్యదర్శి లావణ్యను సత్కరిస్తున్న ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు


పాతపట్నం: వెలుగు కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


నరసన్నపేట: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి, తదితరులు


ఆమదాలవలస రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు


సరుబుజ్జిలి: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సర్పంచ్‌లను సత్కరిస్తున్న మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, అధికారులు


సారవకోట: ఎంపీడీఓ సమావేశ మందిరంలో చిన్నాల కూర్మినాయుడును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


ఎల్.ఎన్.పేట: కృష్ణాపురం సర్పంచ్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ కె.త్రినాథరావు, ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు


బూర్జ: ఎంపీడీఓ కార్యక్రమంలో బూర్జ సర్పంచ్ ఏగు అనురాధను సత్కరిస్తున్న జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, అధికారులు


మెళియాపుట్టి: సర్పంచ్‌లను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రకుమారి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


ఆమదాలవలస రూరల్: నెల్లిపర్తిలో కరపత్రాలు అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ వెంకటరమణ


సరుబుజ్జిలి: మర్రిపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్.ఎన్.పేట: ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని చొర్లంగి పంచాయతీ జంబాడ గిరిజన గ్రామంలో సోమవారం సాయంత్రం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం జగన్ పాలనలో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్సీపీ మండల నాయకులు రెడ్డి రామారావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని షళంత్రి పంచాయతీ మర్రిపాడు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం మా నమ్మకం నీవే జగనన్న నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ఆమదాలవలస రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని సచివాలయ కన్వీనర్ మానుకొండ వెంకటరమణ అన్నారు. మండలంలో నెల్లిపర్తి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తూ జగనన్న సిక్టర్‌ను ఇంటి గోడలకు అతికించారు. గృహ సారథులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం


కండ్రకులస్తులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, కండ్ర కులస్తులు

పాతపట్నం: కండ్ర కులస్తులను బీసీ–ఏలో చేర్చేలా జీఓ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పాతపట్నం మండలం కండ్ర కులస్తులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మత్స్యకార రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ బెనియా విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల సీఎం వైఎస్ జగన్ టెక్కలి నియోజకవర్గ పర్యాటనకు వచ్చినప్పుడు బీసీ–ఏలోకి చేర్చాలని వినతిపత్రం అందజేశామన్నారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే రెడ్డి శాంతిని సత్కరించారు. తెంబూరు సర్పంచ్ బెనియా సర్పంచ్ వెంకటరమణ, వైస్ సర్పంచ్ ఈశ్వరరావు, ఆయల చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, వైస్ ఎంపీపీ ప్రదీప్, రమేష్, శ్రీధర్, కండ్ర కులస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

- జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు


రికార్డులను తనిఖీ చేస్తున్న లవరాజు

ఎల్.ఎన్.పేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలను చెక్ పెట్టేందులకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ, రికార్డులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేక్ హాజరును అరికట్టడానికి ప్రత్యేక యాప్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. రోజుకు రెండు సార్లు ఫొటోలు అప్‌లోడ్ చేసి ఉపాధి హామీ వేనతదారుల హాజరును పారదర్శంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల్లో పనులు సక్రమంగా చేపట్టాలని, పంచాయతీల్లో గుర్తించిన పనులు మాత్రమే చేపట్టాలన్నారు. ఉపాధి పనులు సామాజిక తనిఖీలు పారదర్శంగా చేపట్టాలని, సామాజిక తనిఖీల్లో రికవరీ తప్పసరిగా కట్టాలన్నారు. ఏపీడీ పి.రాధ, ఏపీఓ వి.శ్రీదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలు


ఘటనా స్థలంలో వైద్యసేవలు అందజేస్తున్న బూర్జ పీహెచ్‌సీ వైద్యుడు రాజశేఖర్

బూర్జ: మండలంలోని మదనాపురం – బూర్జ ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాల ప్రకారం .. మన్యం జిల్లా పాలకొండ మండలం పొట్లికి చెందిన బెజ్జిపురం అరుణకుమారి బైక్‌పై బూర్జ మండలం అన్నంపేట గ్రామంలోని బంధువల ఇంటికి వస్తున్నారు. మదనాపురం దగ్గర బైక్ వెనుక కూర్చున్న అరుణకుమారి జారి పడిపోయింది. తలకు బలమైన గాయాలు తగలడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. అదేగ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఉన్న బూర్జ పీహెచ్‌సీ వైద్యుడు జి.రాజశేఖర్ ప్రథమ చికిత్స అందజేశారు. 108లో రాగోలు జెమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగాం: నందిగాం జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన కారు డ్రైవర్ మీసాల నాగరాజుతో పాటు ఆదే వీధికి చెందిన అతని బంధువు ఎస్.రామారావు(42) కలిసి శ్రీకాకుళంలో ఒక ఆస్పత్రి నుంచి ఒక రోగిని వజ్రపుకొత్తూరు మండలం పూండికి తీసుకొచ్చారు. తిరుగు ప్రయాణంలో రామారావు డ్రైవర్ నాగరాజును కారు నడిపేందుకు ఇమ్మని అడగడంతో, కారు నడిపేందుకు రామారావుకు ఇచ్చి నాగరాజు పక్క సీట్లో కూర్చున్నాడు. అయితే నందిగాం ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీ కొనడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొంది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న రామారావు బయటకు ఎగిరిపడ్డాడు. రోడ్డుకు తల బలంగా తగలడంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో నాగరాజుకు చిన్న గాయాలవ్వడంతో పోలీసులు 108 వాహనంలో టెక్కలి ఆస్పత్రికి తరలించారు. రామారావు మృతదేహాన్ని టెక్కలి మార్చురీకు తరలించారు.

పని దినాలు కల్పించాలని వినతి

రణస్థలం: అర్ధాంతరంగా నిలుపుదల చేసిన యూబీ ఒప్పంద కార్మికులందరినీ విధుల్లోనకి తీసుకుని పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించా లని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీ.హెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. యునైటెడ్ బ్రేవరీస్ ఒప్పంద కార్మికులందరికీ పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు పాల్గొన్నారు.

కోటేశ్వరస్వామికి అభిషేకాలు


స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వరస్వామికి వైశాఖ మాస సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న దేవదాయ శాఖ సలహాదారు


శ్రీకూర్మనాథాలయంలో జ్వాలాపురపు శ్రీకాంత్

గార: శ్రీకూర్మనాథుడ్ని దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదులతో అధికారులు స్వాగతం పలికారు. మూలవిరాట్ దర్శనం అనంతరం శ్రీకూర్మ క్షేత్ర వైభవాన్ని అర్చకులు తెలియజేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణమాచార్యులు, కిశోర్‌బాబు ఉన్నారు.

నిత్యన్నదానానికి రూ. లక్ష విరాళం


చెక్‌ను అందజేస్తున్న దృశ్యం

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయంలో జరుగుతున్న నిత్యన్నదాన పథకానికి శ్రీకాకుళానికి చెందిన కురసా రవికుమార్, ఛాయారెడ్డిలు రూ. ఒక లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని సోమవారం అందజేశారు. ఈ మేరకు చెక్‌ను కార్యాలయ సూపరింటెండెంట్ నర్సుబాబుకు అందజేశారు.

20 రోజుల్లో ట్యాంక్ నిర్మాణం పూర్తి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు


సంప్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీకి జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.2.47 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అందులో భాగంగా లక్ష లీటర్ల ట్యాంక్ (సంప్) నిర్మాణ పనులు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి.మధుసూదనరావు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో మహేంద్ర తనయ నది ఒడ్డున తాగునీటి సంప్ నిర్మాణ పనులను డీఈఈ సోమవారం పరిశీలించారు. లక్ష లీటర్ల సంప్ నిర్మాణం చేపడుతున్నామని, 20 రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. అమ్మవారి ఉత్సవాలకు తాగునీరు అందజేయడానికి ప్రయత్నిస్తామన్నారు. రూ.5 కోట్లతో పాతపట్నం, కొత్తూరు, పెద్ద సీది, గంగువాడ గ్రామాలకు జెజెఎం ప్రాజెక్టులో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు మంజూరయ్యాయన్నారు. జేఈ కల్యాణ్, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటరమణ, జి.రాము, టి.సుధాకర్, ఎం.వరదరాజు, కె.బైరాగి, పి.నగేష్, బోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

- సీఐ వేణుగోపాలరావు


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు: నాటు సారా తయారుచేసినా, విక్రయించినా, తరలించినవారిపై వరుసుగా కేసులు నమోదైతే పీడీ యాక్టు పెడతామని సీఐ ఆర్.వేణుగోపాలరావు తెలిపారు. కొత్తూరులోని సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మహిళలను వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం ఆడుతూ పట్టుబడినవారిపై కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నందున బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన వ్యక్తులపై కేసు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున యువకులు లోన్ యాప్‌లతో మోసపోవద్దని సూచించారు. ఈ ఏడాది ఇంతవరకు నాటసారా కేసులు 35 మందిపై నమోదు చేసినట్లు చెప్పారు. కాశీ పుష్కరాలతోపాటు ఇతర యాత్రలకు వెళ్లేవారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. మండలంలోని ఆంధ్ర–ఒడిశా సరిహద్దు అయిన నివగాం వద్ద 24 గంటలూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఐ మురపాక గోవింద ఉన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

ఎల్.ఎన్.పేట: పక్కా ఇళ్లు మంజూరు చేయాలని మండలంలోని కోవిలం గ్రామానికి (ఆర్.ఆర్ కాలనీ, తులగాం) చెందిన నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వంశధార ప్రాజెక్టు హిరమండలం మండలం తులగాం గ్రామానికి చెందిన నిర్వాసితులకు 2018లో ఇళ్లు మంజురయ్యాయన్నారు. ఎల్.ఎన్.పేట మండలం కోవిలంలో స్థలాలు మంజూరు చేసి, ఫొటోలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు కొంత మందికే ఇళ్లు ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. నిర్వాసితులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో లోచర్ల లక్ష్మి, జి.సాయిలత తదితరులు పాల్గొన్నారు.